# సాక్షి కుమురం భీం

సోమవారం । 22 । జూలై । 2024






**దుర్గమ్మకు ప్రణమిల్లి**

ఎంసీసీ క్వారీలో నిర్వహించిన దుర్గాదేవి జాతరకు భక్తులు పోటెత్తారు. దుర్గామాతకు మొక్కులు చెల్లించి సహపంక్తి భోజనాలు చేశారు. 8లో▸



**దొంగలకే దొంగలు..!**

అటవీ శాఖ అధికారుల మరో అవినీతి బాగోతం బట్టబయలైంది. 50 దుంగలను స్వాధీనం చేసుకోగా తెల్లవారే సరికి 30 మాయమయ్యాయి. 8లో▸

**వాతావరణం**

గరిష్ఠం/కనిష్ఠం 28.5 /25.4

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి. అల్పపీడనం ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని షిర్డీ సాయి మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అర్చకులు ఇందారపు మధుకరశర్మ, సాయిశర్మ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సామూహిక గురుచరిత్ర పారాయణం పూర్తికాగా.. పుస్తక పూజ నిర్వహించారు. అనంతరం అర్చకులు మధుకర శర్మ మాట్లాడుతూ గురువు దైవంతో సమానమని, గురువు త్రిమూర్తి స్వరూపుడని పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున సాయినాథుడిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి తరలివచ్చారు. సాయినాథుడి ఉత్సవ విగ్రహాలతో పల్లకిసేవ నిర్వహించారు. సాయంత్రం సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తాటిపెల్లి రమేశ్‌, కమిటీ ప్రతినిధులు రావుల దిలీప్‌, గంధం వినోద్‌, అశోక్‌, తపాసె నాందేవ్‌ తదితరులు పాల్గొన్నారు.

### అసెంబ్లీలో సమస్యలు ప్రస్తావించాలి

ఆసిఫాబాద్‌రూరల్‌: 'సమగ్ర శిక్ష' ఉద్యోగుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని ఆ సంఘం నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం అందించారు. క్లస్టర్‌ రిసోర్స్‌ పర్సన్‌ అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్‌ మాట్లాడుతూ 'సమగ్ర శిక్ష' ఉద్యోగులను రెగ్యులర్‌ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్‌, నగేష్‌, తిరుపతి, రాము, సుభాష్‌ తదితరులు పాల్గొన్నారు.

### వసతిగృహాలకు కొత్త భవనాలు నిర్మించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లాలోని వసతిగృహాలకు కొత్త భవనాలు నిర్మించాలని కేవీపీఎస్‌ జిల్లా కార్యదర్శి దినకర్‌ అన్నారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై ఈ నెల 20 నుంచి కేవీపీఎస్‌ ఆధ్వర్యంలో చేపట్టిన అధ్యయన యాత్రలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత భవనాల్లో మరుగుదొడ్లు, ఫ్యాన్లు లేవన్నారు. పర్యవేక్షణ లేక కనీసం మెనూ ప్రకారం భోజనం కూడా అందడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నగేశ్‌, నాయకులు ఉన్నారు.

### ఎన్‌హెచ్‌ఎం సిబ్బందిని రెగ్యులరైజ్‌ చేయాలి



మాట్లాడుతున్న రాజేశ్‌ ఖన్నా

ఆసిఫాబాద్‌: జాతీయ ఆరోగ్య మిషన్‌లో పని చేస్తున్న సిబ్బందిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్‌ చేయాలని ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్‌ ఖన్నా అన్నారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్‌ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా జాతీయ ఆరోగ్య మిషన్‌, ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగులకు కనీస వేతనాలు సవరించడం లేదన్నారు. నాలుగో తరగతి సిబ్బందికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఎన్‌హెచ్‌ఎం సిబ్బందికి రూ.17 వేలు చెల్లించాలని డిమాండ్‌ చేశారు. జూలై 24 నుంచి అ సెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో అసెంబ్లీ ముట్టడి చేపడతామని, ప్రతిరోజూ ఇందిరా పార్కు వద్ద ధర్నా చేపడతామని తెలిపారు. అనంతరం సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోగె ఉపేందర్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్లుగా గ్యార వినోద్‌, ఎండీ షకీల్‌, ఉపాధ్యక్షుడిగా చిరంజీవి, గోపికృష్ణ, చంద్రకళ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మధుకర్‌, సహాయ కార్యదర్శిగా ముస్తాక్‌, శ్రీదేవి, సాయిలత, కోశాధికారిగా సంగీతను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్‌ఎం స్టేట్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ సురేశ్‌నాయక్‌, నాయకులు కొండ్ర లత తదితరులు పాల్గొన్నారు.

# వీడని ముసురు

- జిల్లాలో మూడోరోజూ జోరువాన
- 63.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం
- ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత, వార్ధా నదులు



కెరమెరి: లక్మాపూర్‌ వాగు దాటుతున్న ప్రజలు

ఆసిఫాబాద్‌: జిల్లాలో మూడోరోజు సైతం ముసురు వీడలేదు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మహారాష్ట్రతోపాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత, వార్ధా, పెన్‌గంగ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నదుల వద్దకు ఎవరూ రావొద్దని అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆదివారం జిల్లాలో 63.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా లింగాపూర్‌లో 108.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా.. జైనూర్‌లో 85.4, సిర్పూర్‌(యూ) 75.2, తిర్యాణి 55, రెబ్బెన 42.4, ఆసిఫాబాద్‌ 81, కెరమెరి 59.8, వాంకిడి 72.2, కాగజ్‌నగర్‌ 26.6, సిర్పూర్‌(టి) 34.2, కౌటాల 61.2, చింతలమానెపల్లి 74.8, బెజ్జూర్‌ 56.4, పెంచికల్‌పేట్‌ 62.6, దహెగాంలో 54.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**ప్రాజెక్టుల్లోకి భారీ వరద**

భారీ వర్షంతో కుమురంభీం(అడ), వట్టివాగు ప్రాజెక్టుల్లోకి భారీగా వరద చేరుతోంది. అధికారులు కుమురంభీం ప్రాజెక్టు 3 గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. ఇన్‌ఫ్లో 3258 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 3258 క్యూసెక్కులు ఉంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 243 మీటర్లు కాగా ఆదివారం 237.9 మీటర్లకు చేరింది. దిగువ ప్రాంతాల ప్రజలను ఇప్పటికే అప్రమత్తంగా చేశారు. అలాగే వట్టివాగు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 1099 క్యూసెక్కులు ఉంది. రెండు ప్రధాన కాలువల ద్వారా సాగు కోసం 100 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



కౌటాల: ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత నది



కౌటాల: తాటిపల్లి వద్ద వార్ధా నది ఉధృతి

**ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు, వాగులు**

జిల్లాతోపాటు మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాణహిత, వార్ధా, పెన్‌గంగ నదులతోపాటు కెరమెరి, చింతలమానెపల్లి, దహెగాం, కౌటాల, పెంచికల్‌పేట్‌, కాగజ్‌నగర్‌ మండలాల్లో వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. ఆసిఫాబాద్‌ మండలంలోని గుండి వాగు ఉధృతితో అవతలి వైపు ఉన్న గ్రామాలకు జిల్లా కేంద్రం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. కెరమెరి వారసంతకు వెళ్లిన ప్రజలు లక్మాపూర్‌ వాగును ప్రమాదకరంగా దాటారు. నదుల్లో వరద పెరగడంతో గంగపుత్రులు చేపల వేట నిలిపివేశారు. మహారాష్ట్రకు నాటుపడవల రాకపోకలు నిలిపివేశారు. ప్రాణహిత నది సైతం పరవళ్లు తొక్కుతూ కౌటాల మండలంలోని పుష్కరఘాట్లను వరకు తాకుతుంది. పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

### అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయం నుంచి ఆదివారం పోలీసు అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌ నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రాణహిత ఉప్పొంగుతున్న నేపథ్యంలో నది వద్దకు ఎవరూ వెళ్లకుండా బందోబస్తు చేపట్టాలన్నారు. అలాగే వాగులు, కాల్వలు దాటకుండా చూడాలన్నారు. పోలీస్‌ అధికారులు హెడ్‌ క్వార్టర్‌లో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్‌ 100 ద్వారా ప్రజలు సమాచారం అందించాలన్నారు. విద్యుత్‌ స్తంభాలు, తీగలకు చిన్నారులను దూరంగా ఉంచాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని పంట పొలాల వద్ద రైతులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలకు రోడ్లు, వంతెనలు తెగిపోయి రాకపోకలు నిలిచిపోతే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

### మున్సిపల్‌ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్‌ ఇన్‌



అంజయ్య, మున్సిపల్‌ కమిషనర్‌, కాగజ్‌నగర్‌

కాగజ్‌నగర్‌ రూరల్‌: వర్షాకాలం సీజనల్‌ వ్యాధుల కాలం. పారిశుధ్యం లోపించి, కాలువల్లో మురుగు నీరు స్థిరంగా నిలిచి ఉండి, రహదారుల పక్కన, ఖాళీ ప్రదేశాలు, ఇళ్ల పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయి. డెంగీ, మలేరియా వంటి జ్వరాలు, సీజనల్‌ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయి. ఈ క్రమంలో కాగజ్‌నగర్‌ పట్టణంలోని సమస్యలపై మున్సిపల్‌ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్‌ ఇన్‌ నిర్వహిస్తోంది. పట్టణ ప్రజలు నేరుగా కమిషనర్‌తో మాట్లాడే అవకాశాన్ని కల్పిస్తోంది. మున్సిపాలిటీ ప్రజలు తమ ప్రాంత సమస్యలపై కమిషనర్‌ను నేడు ఫోన్‌లో సంప్రదించవచ్చు.

**అంశం:** పారిశుధ్య నిర్వహణ, సీజనల్‌ వ్యాధుల నియంత్రణకు చర్యలు

సమయం: సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

**63006 88040**

# హైస్కూళ్ల పనివేళల్లో మార్పు

- ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు..
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ అధికారులు
- నేటి నుంచి అమలు..



పాపన్‌పేట్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల

పెంచికల్‌పేట్‌(సిర్పూర్‌): ఉన్నత పాఠశాలల పని వేళలు మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో ఉన్న పని వేళలను మారుస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని అధికారులు వెల్లడించారు. నేటి నుంచి జిల్లాలోని 68 ఉన్నత పాఠశాలలు(లోకల్‌ బాడీ) ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.15గంటల వరకు పని చేయనున్నాయి.

**గతంలో ఇలా..**

గతంలో ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు, ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 నుంచి 4.45 గంటల వరకు పని చేశాయి. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల సమయంలో తేడా ఉండటంతో పనివేళల్లో మార్పు చేయాలని పలువురు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు కొనసాగుతాయని ఆదేశాలు జారీ చేసింది. ఉదయం ఉదయం 9 గంటలకు మొదటి పీరియడ్‌ ప్రారంభమవుతుంది. రెండో పీరియడ్‌ తర్వాత ఉదయం 10.30 నుంచి 10.45 వరకు విరామం ఉంటుంది. నాలుగో పీరియడ్‌ తర్వాత మధ్యాహ్నం 12.15 గంటల నుంచి ఒంటి గంట వరకు లంచ్‌బ్రేక్‌, ఆరో పీరియడ్‌ తర్వాత మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 2.45 గంటలకు వరకు మరోసారి విరామం ఉంటుంది. చివరి పీరియడ్‌ సాయంత్రం 3.30 గంటల నుంచి 4.15 గంటల వరకు కొనసాగనుంది.

### నేటి నుంచి అమల్లోకి..

జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నూతన పనివేళలు నేటి నుంచి అమల్లోకి వస్తాయి. ఇప్పటికే మండల విద్యాశాఖ అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పాఠశాలలు కొనసాగించాలి.

– పి.అశోక్‌, డీఈవో

# పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్‌'

- జాతీయ విద్యావిధానం అమలుకు నాలుగేళ్లు..
- నేటి నుంచి ఈ నెల 28 వరకు వారోత్సవాలు

కెరమెరి(ఆసిఫాబాద్‌): కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం(ఎన్‌ఈపీ– 2020) ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో నేటి నుంచి వారోత్సవాలు నిర్వహించేందుకు విద్యాశాఖ సమాయత్తమైంది. సోమవారం నుంచి ఈ నెల 28 వరకు శిక్షా సప్తాహ్‌ పేరుతో జిల్లాలో పలు కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. 2020లో ఎన్‌ఈపీ(నేషనల్‌ ఎడ్యుకేషన్‌ పాలసీ)ని ప్రవేశపెట్టగా 2020 జూలై 29న కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. జాతీయ విద్యావిధానాన్ని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో నేటి నుంచి వారం రోజులపాటు శిక్షా సప్తాహ్‌ నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 739 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 45 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే ఈ కార్యక్రమంలో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానికులు భాగస్వాములు చేయాలని జిల్లా అధికారులు సూచించారు.

**రోజువారీ కార్యక్రమాలు ఇలా..**

**22న సామగ్రి ప్రదర్శన :** తొలిరోజు బోధన సామగ్రి ప్రదర్శన నిర్వహించాలి. ఉపాధ్యాయులు స్థానికంగా లభించే వనరులతో రూపొందించిన బోధన అభ్యసన సామగ్రిని ప్రదర్శిస్తారు.

**23న పునాది అభ్యసన :** ఒకటో తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, గణితంలోని సంఖ్యాశాస్త్రం, నైపుణ్యాల అభివృద్ధి అమలుపై చర్చిస్తారు.

**24న క్రీడా దినోత్సవం:** విద్యార్థులకు శారీరక దారుఢ్యం ప్రాధాన్యం తెలిపేలా పలు రకాల క్రీడాంశాలపై పోటీల్లో నిర్వహించడం, ప్రాధాన్యత వివరించడం.

**25న సాంస్కృతిక దినోత్సవం:** భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడం, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు(ఫ్యాన్సీ డ్రెస్‌, పాటలు, నృత్య ప్రదర్శన, నాటికలు) నిర్వహించడం.

**26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం:** ఉద్యోగావకాశాల కల్పన నేపథ్యంలో అన్ని తరగతుల వారికి నూతన నైపుణ్యాల అవసరాన్ని గుర్తించడం. విధుల్లో సాంకేతిక అభివృద్ధిని గుర్తించేలా చర్చించడం.

**27న పర్యావరణ పరిరక్షణ దినోత్సవం:** పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్ర, కృత్యాల(మిషన్‌ టైప్‌ యాక్టివిటీస్‌) కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో పోషణ్‌ దినోత్సవం నిర్వహణ, ఎకోక్లబ్‌ల ఏర్పాటు, విద్యార్థులు, వారి తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడంపై అవగాహన, బడిలో అధిక సంఖ్యలో మొక్కలు నాటించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి.

**28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం:** విద్యార్థుల సామాజిక భావోద్వేగ శ్రేయస్సు కోసం స్థానికులు, తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయుల సంఘాల సహకారంతో పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాల్లో సహపంక్తి భోజనం చేయడం.

### విజయవంతం చేయాలి

నేటి అన్ని పాఠశాలల్లో విద్యా వారోత్సవాల కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులను 'శిక్షా సప్తాహ్‌'లో భాగస్వాములు చేయాలి. ఫొటోలు, వీడియోలు సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్‌ చేయాలి. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎంఈవోలు, ఎస్‌ఎస్‌వో చొరవ చూపాలి

– పి.అశోక్‌, డీఈవో

# ఆ'గని' లొల్లి

- 'శ్రావణపల్లి'పై ఆసక్తి చూపని సింగరేణి
- ప్రైవేటుకు అప్పగించేందుకు కేంద్రం మొగ్గు
- అయినా ఆసక్తి చూపని ప్రైవేటు సంస్థలు
- కేంద్ర, రాష్ట్రాల మధ్య రాజకీయ అంశంగా ప్రైవేటీకరణ



శ్రావణపల్లి గ్రామం

శ్రీరాంపూర్‌: సింగరేణిలో శ్రావణపల్లి బొగ్గుగని లొల్లి సద్దుమణగడం లేదు. ఈ గనిపై కొద్ది నెలలుగా తీవ్ర చర్చ జరుగుతోంది. కేంద్రం ఈ గనిని వేలం జాబితాలో చేర్చడాన్ని సింగరేణి కార్మిక సంఘాలు, కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ గనిని సింగరేణికే కేటాయించాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాసింది. అయితే కేంద్రం ప్రైవేటుకు కేటాయించేందుకే మొగ్గు చూపుతోంది. ఇటీవల నిర్వహించిన వేలంలో గనిని చేర్చింది. కానీ ఈ వేలంలో శ్రావణపల్లి గని కోసం ప్రైవేటు కంపెనీలు టెండర్‌ వేయలేదు. ఈ నెల 17న టెండర్‌ ఓపెన్‌ చేయాల్సి ఉండగా టెండర్‌లు దాఖలు కాకపోవడంతోనే కేంద్రం ఎలాంటి ప్రకటన చేయలేదని అధికారులు పేర్కొంటున్నారు.

### వేలాన్ని వ్యతిరేకిస్తున్న సింగరేణి..

తెలంగాణలో బొగ్గు గనుల వేలం ప్రక్రియపై సింగరేణి మొదటి నుంచి అభ్యంతరం చెబుతోంది. ఈ క్రమంలో వేలానికి కూడా దూరంగా ఉంటోంది. ఎంఎండీఆర్‌ యాక్ట్‌ ప్రకారం నేరుగా అలాట్‌మెంట్‌ చేయాలని కోరుతోంది. ఇటు ప్రైవేటు సంస్థలు వేలంలో ముందుకు రాకపోగా, సింగరేణికి కూడా అలాట్‌ చేయకపోవడంతో శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌పై లొల్లి సద్దుమణగడం లేదు. ప్రైవేటు సంస్థలు కూడా గని కోసం ఎందుకు టెండర్‌ వేయడం లేదన్న చర్చ జరుగుతోంది. గనిలో మైనింగ్‌కు ఉన్న అనుకూల, ప్రతికూల అంశాలు, లాభదాయక ప్రాజెక్టా.. నష్టదాయకమైనదా అన్న చర్చ జరుగుతోంది.

### 1990లోనే బీజం..

1990లోనే ఈ గనికి బీజం పడింది. బొగ్గు గనుల విస్తరణలో భాగంగా జియాలాజికల్‌ సర్వే ఆఫ్‌ ఇండియా(జీఎస్‌ఐ) మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం శ్రావణపల్లిలో బొగ్గు నిక్షేపాలను గుర్తించింది. తరువాత మినరల్‌ ఎక్స్‌ప్లోరేషన్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌(ఎంఈసీఎల్‌) ఖనిజాన్వేషణ చేసింది. సింగరేణి ఎక్స్‌ప్లోరేషన్‌ విభాగం కూడా బోర్‌ హోల్స్‌ వేసి నిక్షేపాలు ఎంత ఉన్నాయి, ఎంతో లోతుల్లో ఉన్నాయని గుర్తించింది. దీంతో 2013లో సింగరేణి అధికారులు దీనిపై పూర్తిగా మైనింగ్‌ ప్లాన్‌ రిపోర్టును తయారు చేశారు. అక్కడ ఉన్న భౌగోళిక పరిస్థితులను బట్టి దీన్ని ఓపెన్‌కాస్టు మైనింగ్‌ ద్వారా మాత్రమే బొగ్గు తీయాల్సి ఉందని రిపోర్టులో పొందుపర్చారు. ఇప్పుడు తాజాగా కేంద్రం వేలం వేసిన టెండర్లలో నాడు కంపెనీ గుర్తించిన పూర్తి ప్రాజెక్టును తీసుకోకుండా కొంత భాగం తగ్గించి ప్రాజెక్టులో మార్పులు చేసి టెండర్లను పిలిచింది.

### టెండర్‌ ప్రకారం గని వివరాలు

- ప్రాజెక్టుకు 1,018 హెక్టార్ల ప్రైవేటు భూమి అవసరం
- 129 బోర్‌ హోల్స్‌ ఉన్నాయి
- 11 సీమ్‌ల ద్వారా బొగ్గు వెలికితీత
- బొగ్గు గ్రేడ్‌ : జీ 11
- బొగ్గు నిక్షేపాలు లోతు: 23 మీటర్ల నుంచి 430 మీటర్లు
- మొత్తం బొగ్గు నిల్వలు: 119.90 మిలియన్‌ టన్నులు
- ముంపునకు గురయ్యే గ్రామాలు: శ్రావణపల్లి, ఆవుడం
- నిర్వాసిత కుటుంబాలు : శ్రావణపల్లిలో 375, ఆవుడంలో 375

### ఉత్పత్తి ఖర్చు ఎక్కువే..

సింగరేణి బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గించుకునేందుకు ఓసీపీలకే మొగ్గు చూపుతోంది. అయితే, భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా శ్రావణపల్లి ఓసీపీలో ఇతర ఓసీపీలతో పోలిస్తే ఉత్పత్తి వ్యయం ఎక్కువవుతుందని కంపెనీ ప్రాజెక్టు రిపోర్టు చెబుతోంది. 1:17 ప్రకారం బొగ్గు, మట్టి తీయాల్సి ఉంటుంది. అంటే.. టన్ను బొగ్గు తీయడానికి 17 టన్నుల మట్టి తీయాల్సి ఉంది. దీంతో ఉత్పత్తి ఖర్చు అధికమతువుంది. సింగరేణిలో అన్ని ఓసీపీల్లో సరాసరిగా 1: 7 ప్రకారం బొగ్గు, మట్టి తీస్తున్నారు. దీని ప్రకారమే లాభాలు గడిస్తున్నాయి. శ్రావణపల్లిలో ఓబీ ఎక్కువ తీయాల్సి ఉండటంతో ఉత్పత్తి ఖర్చు ఎక్కువగా అవుతుంది. దీనికి తోడు నిర్వాసితులకు పరిహారాలు, భూముల పరిహారాలు తడిసిమోపెడయ్యే అవకాశం ఉంది. మామిడి తోటల పరిహారం అధికంగానే చెల్లించాల్సి ఉంది. సుమారు 60 వేల మామిడి చెట్లు ఉన్నాయి. వీటికే రూ.30 కోట్ల ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు పరిధిలోనే రాష్ట్రాలను అనుసంధానం చేసే 765కే విద్యుత్‌లైన్‌ టవర్లు ఉన్నాయి. వీటి షిఫ్టింగ్‌ కూడా పెద్ద సమస్యగానే ఉంది. ఇక ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ, నిర్వాసితులను తరలించడం ఇవన్నీ బేరీజు వేసుకుంటే ప్రాజెక్టుతో పెద్దగా లాభం ఉండదనే ప్రైవేటు సంస్థలు టెండర్‌కు దూరంగా ఉన్నాయని తెలుస్తోంది.

### సింగరేణి వెనుకడుగు..

ప్రాజెక్టు రిపోర్టు రూపొందించిన తరువాత సింగరేణి యాజమాన్యం కూడా ఈ బొగ్గు గనిని చేపట్టడానికి వెనుకడుగు వేసింది. ఉత్పత్తి వ్యయం అధికంగా ఉండడమే ఇందుకు కారణం. రూ. కోట్ల ఖర్చు చేసి బొగ్గు నిల్వలు అన్వేషించి ప్రాజెక్టు ప్లాన్‌ రూపొందించినప్పటికీ తవ్వకాల కోసం కేంద్రాన్ని అనుమతి కోరలేదు. దీంతో ప్రాజెక్టుకు ఒక్క అడుగు ముందుకు పడలేదు. భవిష్యత్‌లో కొత్త టెక్నాలజీ వచ్చిన లేదా కంపెనీ యాజమానిగా ఉంటూ ఓబీ మొదలు, బొగ్గు తీసే పనులు కూడా ప్రైవేటుతో చేయిస్తే లాభాలు మిగుల్చుకోగలుతామనే భావనలో ఉంది. అయితే ఇప్పుడు కేంద్రం దీనిని వేలం జాబితాలో ఉంచింది. అయితే ఈ గని కోసం ఇప్పుడు వేలంలో పాల్గొంటే భవిష్యత్తులో లాభాలు వచ్చే గనులకు కూడా ప్రైవేటు సంస్థలతో పోటీ పడాల్సి ఉంటుందని సింగరేణి భావిస్తోంది. అందుకే నేరుగా గని అలాట్‌ చేసేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారు. కేంద్రం సింగరేణికి ఈ గనికి అలాట్‌ చేస్తే కంపెనీ కూడా 80 శాతం మైన్స్‌ ఆపరేషన్స్‌ను కాంట్రాక్ట్‌ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. ఏది ఏమైనా కేంద్ర, రాష్ట్రాల మధ్య రాజకీయం అంశంగా బొగ్గు గనుల ప్రైవేటీకరణ మారింది. ఈక్రమంలో శ్రావణపల్లి గని భవితవ్యం కొద్ది రోజుల్లో తేలనుంది.

# వైభవంగా బోనాలు





కాగజ్‌నగర్‌రూరల్‌: సర్‌సిల్క్‌కాలనీలోని మహంకాళి ఆలయంలో ఆదివారం బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే హరీశ్‌బాబు దంపతులు, జిల్లా పరిషత్‌ మాజీ చైర్మన్‌ కోనేరు కృష్ణారావు, కాంగ్రెస్‌ నాయకులు రావి శ్రీనివాస్‌, జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్‌, జి.ఆనంద్‌ దంపతులతోపాటు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాజీవ్‌చౌరస్తా నుంచి శివసత్తులు, పోతరాజుల నృత్యాలతో శోభాయాత్ర ఆలయం వరకు కొనసాగింది.

## క్లుప్తంగా

### బొక్కివాగులో దూకి ఆత్మహత్య


సంతోష్ (ఫైల్)

దహెగాం(సిర్పూర్): మండలంలోని ఇట్యాల గ్రామానికి చెందిన కొట్రంగి సంతోష్ (35) బొక్కి వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కందూరి రాజు తెలిపారు. శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లి సమీపంలోని బొక్కి వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వాగులో గాలించగా ఆదివారం మధ్యాహ్నం మృతదేహం లభించింది. మృతుని భార్య భూదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతి


రమేశ్(ఫైల్)

జైపూర్: మండలంలోని ఇందారం రాజీవ్ రహదారిలో గల అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐకే ఓసీపీలో సర్వే మజ్దూర్‌గా పని చేస్తున్న సింగరేణి కార్మికుడి యాదగిరి రమేశ్ (35) మృతి చెందాడు. పెద్దపల్లి జిల్లా అందుగులపల్లికి చెందిన రమేశ్ శనివారం రెండో షిఫ్టు విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ముందుగా రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య స్రవంతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

### రైళ్ల హాల్టింగ్, రోడ్లకు నిధుల కోసం కృషి చేస్తా


గడ్డం వంశీకృష్ణ

మంచిర్యాలటౌన్:పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని రోడ్లకు అవసరమైన నిధుల తోపాటు, వంతెనల నిర్మాణం, కొత్త రైళ్లు, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు హాల్టింగ్ తదితరాల కోసం కృషి చేస్తానని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు 12 ఏళ్లుగా కొత్త రైలు లేదన్నారు. సూపర్‌ఫాస్ట్ రైలు మంజూరు కోసం పార్లమెంటు సాక్షిగా ప్రభుత్వాన్ని కోరుతానని పేర్కొన్నారు. 2009లో వివేక్ వెంకటస్వామి ఎంపీగా ఉండి, హైదరాబాద్ నుంచి బెల్లంపల్లి వరకు ఇంటర్‌సిటీ రైలును ప్రవేశపెట్టగా, ప్రస్తుతం నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ వరకు వందేమాతరం పేరుతో కొత్త రైలును ప్రవేశ పెట్టాలని కోరుతానని తెలిపారు. మంచిర్యాల నుంచి కాగజ్‌నగర్ మధ్య 3వ రైల్వే లైన్ పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు, ఓదెల రైల్వేస్టేషన్ వద్ద అండమాన్, జమ్ముతావి, కరీంనగర్-తిరుపతి, కాజీపేట-అజ్ని ఎక్స్‌ప్రెస్, మంచిర్యాలలో వైజాగ్ నుంచి న్యూఢిల్లీ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్, కాజీపేట-నాగ్‌పూర్ ప్యాసింజర్ రైలు, కాజీపేట-ముంబై సూపర్‌ఫాస్ట్ రైలు(వయా షిరిడీ), తడోబా రైలు(వయా షిరిడీ), నిజామాబాద్-సిర్పూర్ రైలు, రామగుండం-విజయవాడ రైళ్లను పునరుద్ధరించాలని కోరనున్నట్లు వివరించారు. రవీంద్రఖని స్టేషన్‌లో అండమాన్ ఎక్స్‌ప్రెస్, లక్నో నుంచి అండమాన్, నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ స్పెషల్ రైలు హాల్టింగ్ కోసం కేంద్రానికి ప్రతిపాదించినట్లు తెలిపారు.

# దుర్గమ్మకు ప్రణమిల్లి..


దుర్గాదేవి అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


ధ్వజస్తంభం వద్ద మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

- జనసంద్రంగా మారిన క్వారీ వనం
- వర్షంలో కూడా తగ్గని భక్తుల రద్దీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గఢ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎంసీసీ క్వారీలో నిర్వహించిన దుర్గాదేవి జాతరకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం ఉదయాత్పూర్వమే ఆలయ ఆవరణలో చండీహోమం నిర్వహించారు. ఒకవైపు భారీ వర్షం కురుస్తున్నా తెల్లవారు జామునుంచే జాతరకు భక్తుల తాకిడి పెరిగింది. దీంతో ఆలయ పరిసరాలు, క్వారీ వనంలోని ప్రాంతాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులు దుర్గామాతకు మొక్కులు చెల్లించుకున్నారు. కోళ్లు, మేకలు బలిచ్చి అక్కడే వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయ ఆవరణలోని పోచమ్మ, నాగదేవతలను కూడా దర్శించుకున్నారు.

**ప్రముఖుల రాక...**

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, రాజకుమారి దంపతులతో పాటు మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, సీఐ బన్సీలాల్, రూరల్ సీఐ ఆకుల అశోక్, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, లక్సెట్టిపేట సీఐ నరేందర్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరేశ్‌కుమార్, పలువురు ఎస్సైలు దుర్గాదేవిని దర్శించుకున్నారు. జాతరకు తరలివచ్చిన భక్తులు తమ ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు, కార్లు, ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్లకు వాహన పూజలు చేయించారు.

**భారీ పోలీస్ బందోబస్తు...**

మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ ఆధ్వర్యంలో మంచిర్యాల పోలీసులు జాతరలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా క్వారీ రహదారుల వెంట ట్రాఫిక్ చర్యలు చేపట్టారు. క్వారీ దుర్గాదేవి జాతరకు ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపించారు.


నాగదేవత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే దంపతులు


బందోబస్తు నిర్వహిస్తున్న ఏసీపీ ప్రకాశ్, సీఐలు

# ఉప్పొంగిన లోతొర్రె వాగు


ఉప్పొంగి ప్రవహిస్తున్న లోతొర్రె వాగు

జన్నారం: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని లోతొర్రె వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామంలోని గిరిజనులు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఏటా ఇదే పరిస్థితి దాపురిస్తున్నా పాలకులు దృష్టి సారించడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినా టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని లోతొర్రెకు చెందిన గంగారాం, బాద్‌షా, గంగాధర్, తదితరులు కోరుతున్నారు.

# 'తుతుంగ' వరద ఉధృతి


రోడ్డుకు ఇరువైపులా వరదనీరు

కోటపల్లి: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు తుతుంగ వాగు ఉధృతి రోజురోజుకూ పెరుగుతోంది. 12 గ్రామాల్లో పంటపొలాలు, రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇటీవల లింగన్నపేట, ఎదులబంధం గ్రామాల మధ్యలో రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎమ్మెల్యే వివేక్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించినప్పటికీ నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఈ వర్షాలకు తట్టుకుని నిలవడం కష్టమేనని గ్రామస్తులు మండిపడుతున్నారు. మత్తడి నుంచి పోవాల్సిన నీరు రోడ్డు పక్కనుంచే పోతుండడంతో కోతకు గురవుతోంది. నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి తుతుంగ వాగు నీరు మత్తడి నుంచి పోయేలా చూడాలని 12 గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### కుంగిన జాతీయ రహదారి


పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ కూడలిలో బెల్లంపల్లి వైపు వెళ్లే జాతీయ రహదారి ఆదివారం సుమారు 15 ఇంచుల లోతుకు కుంగింది. విషయం తెలియడంతో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు రహదారి వద్దకు చేరుకుని పరిస్థితిని ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జాతీయ రహదారి కావడంతో హెవీ వెహికిల్స్ లోడ్‌తో రాకపోకలు సాగించే క్రమంలో మరింత కుంగినట్‌లైతే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. పిల్లర్ వేసేటప్పుడు నాసిరకమైన పనులు చేయడం వల్లనే రోడ్డు కుంగిందని పలువురు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా మందమర్రి పాత బస్టాండ్ సమీపంలో వందలాది పిల్లర్స్ ఉన్నాయని వాటిని కూడా పరిశీలించాలని పలువురు సూచిస్తున్నారు.

### శిథిలావస్థకు చేరుకున్న కాజ్‌వే


రోడ్డుపై గుంతలోకి వెళ్తున్న నీరు

చెన్నూర్‌రూరల్: శివలింగాపూర్ నుంచి అక్కెపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో వాగుపై ఉన్న లోలెవల్ కాజ్‌వే పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కాజ్‌వేకు ముందున్న అప్రోచ్ రోడ్డుపై గుంతలుపడి అధ్వానంగా మారుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కాజ్‌వే పూర్తిగా పోతే వాగు దాటని పరిస్థితి. వాగుపై నూతన వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# దళిత సంఘాల ఐక్యవేదిక కమిటీ రద్దు

సాక్షి ఎఫెక్ట్..


నూతనంగా ఎన్నికైన అడ్‌హాక్ కమిటీ

బెల్లంపల్లి: 'ప్రభుత్వ ఎస్సీ కమ్యూనిటీ హాల్ తాకట్టు' అనే శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి బెల్లంపల్లి దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు స్పందించారు. కమ్యూనిటీ హాల్‌లో దళిత సంఘాల నాయకులు, ఎస్సీ, ఉపకులాల శ్రేణులు సమావేశమయ్యారు. అప్పుగా తీసుకున్న రూ.3 లక్షలతో ఏమేం పనులు చేశారో చెప్పాలని నిలదీశారు. దస్తావేజు రాసిచ్చిన నాయకులు, అప్పు ఇచ్చిన వ్యక్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకానొక దశలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో సీనియర్ నాయకులు కల్పించుకుని సముదాయించారు. ఈమేరకు ప్రస్తుతం కొనసాగుతున్న దళిత సంఘాల ఐక్యవేదిక కమిటీని రద్దు చేస్తున్నట్లు, రూ.3 లక్షల అప్పుపై, చేపట్టిన పనులపై నిజనిర్ధారణ కమిటీ వేసి నిగ్గు తేల్చాలని తీర్మానం చేశారు. అందర్నీ కలుపుకుని నూతన కమిటీని ఎన్నుకోవాలని శ్రేణులు ప్రతిపాదించారు. అనంతరం అడ్‌హాక్ కమిటీని ఎన్నుకున్నారు. సభ్యులుగా డీ.ఆర్.శ్రీధర్, గొడిసెల శ్రీహరి, కుంబాల రాజేశ్, దుర్గం గోపాల్, రత్నం ఐలయ్య, బుర్స గోపాల్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు మల్లారపు చిన్నరాజం, చిలుక రాజనర్సు, కాసర్ల యాదగిరి, మాలే మోహన్‌రావు, బండి ప్రసాద్, సాత్కు శ్రీనివాస్, దాసరి ప్రతాప్, ఆసాది మధు, రాజ్‌కుమార్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### పోచమ్మకు వెండి కిరీటం


వెండికిరీటం తీసుకెళ్తున్న కుటుంబసభ్యులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక హమాలీవాడ కట్ట పోచమ్మతల్లికి ఆశోక్‌రోడ్‌కు చెందిన తోట లక్ష్మి కుమారుడు తోట జయ-రాజయ్య కుటుంబసభ్యులు ఆదివారం కిలో వెండి కిరీటం అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

### యువకుడు ఆత్మహత్య

చింతలమానెపల్లి: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని రవీంద్రనగర్-2కు చెందిన సుజయ్ బిశ్వాస్ (26) ఏడాది క్రితం మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుని పాల్వాయినగర్‌లో నివాసం ఉంటున్నాడు. దంపతుల మధ్య కొంతకాలంగా వివాదాలు తలెత్తుతున్నాయి. శనివారం సాయంత్రం ఇద్దరి మధ్య గొడవ జరగడంతో క్షణికావేశంలో ఉరేసుకున్నట్లు సమాచారం. గమనించిన భార్య బంధువులకు సమాచారం అందించగా కొనఊపిరితో ఉన్న సుజయ్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని మామ కృష్ణ హీరా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో యాదవ్ తెలిపారు.

### పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గల మార్కెట్ యార్డ్ సమీపంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి నిందితులను అరెస్టు చేయడంతో పాటు రూ.20,040 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

# చివరి ఆయకట్టుకు నీరందిస్తాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- కడెం ఆయకట్టుకు సాగునీరు విడుదల


కడెం ప్రాజెక్టు ఎడమ కాలువకు నీటిని విడుదల చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

కడెం: కడెం ప్రాజెక్ట్ చివరి ఆయకట్టు వరకు సాగునీరందిస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఎస్ఈ రవీందర్, ఈఈ విఠల్‌తో కలిసి ప్రాజెక్టు ఎడమ కాలువకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కడెం ప్రాజెక్ట్ రెండేళ్లుగా డేంజర్ జోన్‌లోకి వెళ్లిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కడెం మరమ్మతులకు రూ.9.26 కోట్లను మంజూరు చేసి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించిందన్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేశ్, మాజీ ఎంపీపీ అలెగ్జాండర్, మంచిర్యాల జిల్లా నాయకులు త్రిమూర్తి, రాజశేఖర్, రమేశ్‌రావు, ఇసాక్, ఇరిగేషన్ డీఈ భోజదాసు, ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థిని చితకబాదిన మరో విద్యార్థి తండ్రి

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటి విలేజ్‌లో గల ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన గొడవలో ఒక విద్యార్థిపై మరో విద్యార్థి చేయి చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి తండ్రి పాఠశాలకు వచ్చి చేయి చేసుకున్న విద్యార్థిని చితకబాదిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. అయితే విద్యార్థి తండ్రి మరో విద్యార్థిని చితకబాదుతున్న సమయంలో ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులెవరూ లేకపోవడం కొసమెరుపు.. వివరాల్లోకి వెళితే గోలేటి విలేజ్‌లోని ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలో ప్రసాద్ అనే విద్యార్థి ఎనిమిదో తరగతి చదువుతుండగా, సనత్‌కుమార్ అనే విద్యార్థి ఈ సంవత్సరమే నాలుగో తరగతిలో ప్రవేశం పొందాడు. శనివారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగగా ప్రసాద్ సనత్‌కుమార్‌పై చేయి చేసుకున్నాడు. ఆదివారం ఉదయం సనత్‌కుమార్ విషయాన్ని తన తండ్రి శ్రీనివాస్‌కు తెలపడంతో హుటాహుటిన పాఠశాలకు వచ్చి ప్రసాద్‌ను చితకబాదడంతో గాయాలయ్యాయి. విద్యార్థుల ద్వారా విషయం తెలుసుకున్న హెచ్‌ఎం సోమయ్య, ఉపాధ్యాయుడు దేవయ్య రెబ్బెన పీహెచ్‌సీకి తరలించి ప్రథమచికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలించి చికిత్స అందించారు.

**అందుబాటులో ఉండాల్సిన ఉపాధ్యాయులేరి..**

ప్రభుత్వ నింబధనల ప్రకారం ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సెలవు దినాల్లో తోడుగా హెచ్‌ఎం, వార్డెన్‌తో పాటు డ్యూటీ అలాట్‌మెంట్ అయిన ఉపాధ్యాయుడు, ఏఎన్‌ఎం పాఠశాలలోనే ఉండాలి. కానీ ఆదివారం ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలో ఏఒక్కరూ అందుబాటులో లేరు.

**డీటీడీవో, ఏటీడీవో విచారణ**

ఘటనపై డీటీడీవో రమాదేవి, ఏటీడీవో ఖౌముద్ హుస్సేన్ విచారణ చేపట్టి కారణాలు తెలుసుకున్నారు. నివేదికలు తయారు చేసి ఐటీడీఏ పీవోకు అందజేస్తామన్నారు. పాఠశాల హెచ్‌ఎం సోమయ్య ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.


విచారణ జరుపుతున్న డీటీడీవో రమాదేవి



# ప్రాణాలు పోయేవరకూ ఇంతేనా?

- దుబ్బగూడెం గ్రామస్తుల ఆవేదన
- వర్షానికి కూలిన ఇంటిగోడ


దుబ్బగూడెంలో కూలిన ఇంటిగోడ

కాసిపేట: పునరావాసం కల్పించడంలో రెవెన్యూ, సింగరేణి అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ మా ప్రాణాలు పోయె వరకూ వేచి చూస్తారా? అంటూ దుబ్బగూడెం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షానికి శనివారం రాత్రి దుర్గం దుర్గమ్మ అనే వృద్ధురాలికి చెందిన ఇంటిగోడ కూలింది. సమయానికి కుటుంబ సభ్యులు వేరేగదిలో నిద్రిస్తుండడంతో ప్రమాదం తప్పింది. మందమర్రి ఏరియా కేకే ఓపెన్‌కాస్టులో దుబ్బగూడెం నిర్వాసిత గ్రామంగా మారుతోంది. ఏడాదిక్రితం నష్టపరిహారం అందించారు. పునరావాస కాలనీలో ప్లాట్ల కేటాయింపు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లింపులో జాప్యం చేస్తుండటంతో వీరంతా గ్రామంలోనే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు వీలైనంత త్వరగా పునరావాసం కల్పించి ప్యాకేజీ చెల్లించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో ఏదైనా ప్రమాదం జరిగితే రెవెన్యూ, సింగరేణి అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

# దొంగలకే దొంగలు..!

- అటవీశాఖలో అవినీతి బాగోతం
- అక్రమంగా నిల్వ ఉంచిన 50 టేకు దుంగలు గుర్తించిన అధికారులు
- 30 దుంగలు వదిలి.. 20 మాత్రమే స్వాధీనం
- ఇందుకు రూ.1.50 లక్షలు చేతులు మారినట్లు సమాచారం


పట్టుకున్న కలపతో అధికారులు

మంచిర్యాలక్రైం: కలప అక్రమ రవాణాను, వన్యప్రాణులను సంరక్షించాల్సిన అటవీశాఖ అధికారులు.. కంచే చేను మేసిన చందంగా మారారు. తాజాగా అటవీ శాఖ అధికారుల మరో అవినీతి బాగోతం బట్టబయలైంది. భారీగా వేతనాలు తీసుకుంటూనే.. మామూళ్లకు మరిగిన కొంతమంది దొంగలకే దొంగలుగా మారారు. దీంతో కలప అక్రమంగా తరలిపోతోంది. జన్నారం డివిజన్‌లో పనిచేసిన ఓ అధికారి 2017లో కలప తరలిస్తూ అడ్డంగా మీడియాకు దొరికి పోయాడు. అప్పటి ఉన్నతాధికారులు ఆయనను విధుల నుంచి తొలగించారు. తాజాగా ఇలాంటి ఘటన చెన్నూర్ డివిజన్ పరిధిలో వెలుగు చూసింది. కోటపెల్లి రేంజ్ పరిధిలోని అలుగామలో ప్రాణహిత నది గుండా మహారాష్ట్రకు చెందిన కొందరు స్మగ్లరు, స్థానికంగా జనగామ గ్రామానికి చెందిన మరో కలప స్మగ్లర్ కలిసి మూడు తెప్పెల ద్వారా 50 కలప దుంగలను దాటిస్తున్నట్లు ఎఫ్‌ఆర్‌వో రవికి సమాచారం అందింది. ఈ మేరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రవీందర్‌కు సమాచారం అందించగా ములకలపేట, యెంచవెల్లి ఇన్‌చార్జి బీట్ ఆఫీసర్ రవీందర్, పిన్నారం, లింగన్నపేట ఇన్‌చార్జి బీట్ ఆఫీసర్ సత్యనారాయణ, సిర్సా బీట్ ఆఫీసర్ లక్ష్మణ్, కొండంపేట బీట్ ఆఫీసర్ నరేష్ బేస్ క్యాంపు సిబ్బందితో కలిసి శనివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో అలుగామ ప్రాణహిత నదీ తీరానికి చేరుకున్నారు. మూడు తెప్పెల ద్వారా తరలించిన 50 కలప దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రాత్రంతా అటవీ శాఖ అధికారులు అక్కడే ఉండి ఉదయం వాటిని నదిలో నుంచి బయటకు తీయించారు.

**దొరికినవి 50..చూపించినవి 20..**

రాత్రి 50 దుంగలను స్వాధీనం చేసుకోగా తెల్లవారేసరికి 30 మాయమయ్యాయి. స్థానికంగా ఉండే కలప స్మగ్లర్‌కు చెన్నూర్ డివిజన్‌లో పనిచేసే అటవీ అధికారులతో ఉన్న పరిచయంతో రంగంలోకి దిగి సెటిల్‌మెంట్ చేసినట్లు తెలిసింది. ఇందుకు రూ.2 లక్షలు డిమాండ్ చేయగా రూ.1.50 లక్షలకు రాత్రే ఒప్పందం కుదిరింది. దీంతో 30 దుంగలను వదిలేసి 20 దుంగలు ప్రాణహిత నదిలో కొట్టుకుపోతుండగా పట్టుకున్నట్లు అధికారులు చూపించారు.

**షరామామూలే...**

కోటపెల్లి అటవీ శాఖ రేంజ్ పరిధిలో ఇదంత షరామామూలేనని గ్రామస్తులు, కలప స్మగ్లర్లు చర్చించుకోవడం గమనార్హం. కలప స్మగ్లర్లే కొందరు అటవీ శాఖ అధికారులతో చనువుగా ఉంటూ తమకు గిట్టని వారు కలప స్మగ్లింగ్ చేస్తున్నప్పుడు అటవీ అధికారులకు సమాచారం అందించడం, పైగా వాళ్లే సెటిల్‌మెంట్ చేయడం ఇదంతా ఇక్కడ సర్వసాధారణమేనని ఓ కలప స్మగ్లర్లే 'సాక్షి'కి చెప్పడం గమనార్హం. ఇటీవల అటవీశాఖలో బదిలీలు జరుగుతున్నందువల్ల వెళ్లే ముందు అందిన కాడికి దండుకోవడం, కలప పట్టుకున్నట్లు రికార్డ్‌లో చూపేందుకు ఆడిన నాటకమనే చర్చ జరుగుతోంది. ఈ విషయమై జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశీష్ సింగ్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించక పోవడం గమనార్హం.

# దేశీదారు పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి అక్రమంగా తరలిస్తున్న దేశీదారు మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. గాంధీనగర్ బస్తీలో వాహనాల తనిఖీలు చేపట్టగా అనుమానాస్పదంగా వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా 1,590 (90 ఎంఎల్) బాటిళ్లు లభ్యమైనట్లు తెలిపారు. మద్యం విలువ రూ.95 వేలు ఉంటుందన్నారు. అక్రమ రవాణా చేస్తున్న తిరందాజ్ బస్తీకి చెందిన శ్రీకాంత్‌తో పాటు కారును కాగజ్‌నగర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేశ్, సిబ్బంది మధు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.